# 7

# దేవుని శ్రద్ధను రాబట్టుట ఎలా

# (3:40-66)

దేవుడు నీ మనవిని ఆలకించడంలేదనే భావన నీకెప్పుడైనా కలిగిందా? ఆయన దృష్టిని నీవు పొందలేనంత దూరంగా దేవుడు ఉన్నట్టు నీకు ఎప్పుడైనా అనిపించిందా? గాలిచేత కొట్టబడే, గాలి, వాన, మంచు, మంచు గడ్డలతో ఎడతెగక తీవ్రమైన దాడికి లోనైన కొండమీద చెట్టువలె ఒంటరిగా ఉన్నట్టు కొన్నిసార్లు నీవు భావించుకొని యుండ వచ్చు. నిన్ను విరగదీసేలా కొన్నిసార్లు భారాలు దాదాపు నిన్ను భూమికి వంచియుండవచ్చు. పెరికివేయబడకుండ నీవు యింకా ఎంత సహించగలవు అని ఆశ్చర్యపడుతూ ఉండవచ్చు.

దేవుడు ఎందుకు ఏమైనా చేయడు? నీవు బాధలో ఉన్నది ఆయన చూడలేడా? నీకు సంభవిస్తున్న దానిపట్ల ఆయనకు లక్ష్యం లేదా? యూదావారి బాధను, తానుగా అనుభవిస్తున్న బాధను అతడు గమనించినప్పుడు, (యిర్మీయాకు) ఈలాటి ఆలోచనలు వచ్చియుండాలి. కొన్నిసార్లు బహు వచనంలోను, మరి కొన్నిసార్లు ఏక వచనంలోను అతడు మాట్లాడాడు. ఈ బాధయొక్క అనుభవాలు ఏకాంతంగా అనుభవించేవారికి సంబంధించినట్టు లేదు. వ్యక్తిగతమైన తన ఆవేదన, ఆ దేశమంతటి అనుభవాన్ని సూచిస్తుంది. ప్రత్యేకమైన అభిమానానికి యూదా పాత్రమయ్యింది కాదన్న విషయం అతనికి తెలుసు, అంతేగాక, దేవుడు కనికరమును దయయుగలవాడైనట్టు కూడ అతడెరుగు.

విలాపవాక్యాల్లోని ఈ భాగంలో, దేవుని కనికరమును పొందుటకు జనులు ఏమి చేయాలో యిర్మీయా వెలిబుచ్చాడు. ఈ సందర్భానికి సంబంధించి యెహెజ్కేలు యిలా అన్నాడు,

> మీరు జరిగించిన అక్రమ క్రియలన్నిటిని విడిచి నూతన హృదయమును నూతన బుద్ధియు తెచ్చుకొనుడి. ఇశ్రాయేలీయులారా, మీరెందుకు మరణము నొందుదురు? ఇదే ప్రభువగు యెహోవా వాక్కు. ... కావున మీరు మనస్సుత్రిప్పుకొనుడి అప్పుడు మీరు బ్రదుకుదురు ... (యెహెజ్కేలు 18:31, 32).

దేవుని దృష్టి మనవైపు మరల్చబడాలంటే మనం ఏమి చేయాలి? ఇంటియొద్దనుండి తొలిగి దూరంగా వెళ్లిపోయి, దేవునికి దుఃఖం కలిగించే జీవిత విధానంలో చిక్కుకుంటే, ఏమి చేయాలో యిర్మీయా చెప్పుతున్నాడు.

## మారుమనస్సు పొందు

మారుమనస్సంటే – స్వభావము, క్రియ మారునట్లుగా నడిపించే హృదయపు మార్పు.

నిజమైన మారుమనస్సు పూర్తిగా వెనుదిరగడం. యిర్మీయా దీన్ని మూడు - మెట్ల విధానంలో వివరించాడు: "మన మార్గములను పరిశోధించి తెలిసికొని మనము యెహోవాతట్టు తిరుగుదము. ఆకాశమందున్న దేవునితట్టు మన హృదయమును మన చేతులను ఎత్తికొందము" (3:40, 41).

మొదటి మెట్టు ఏమంటే, "మన మార్గములను పరిశోధించి తెలిసికొనుట" (40ఎ వ.). మనకు మార్పు అవసరమని మనం గుర్తించినప్పుడే మారుమనస్సు వచ్చే అవకాశముంది. మన క్రియలోను, స్వభావంలోను మార్పు అవసరమని గుర్తించడం అంత సులభమేమి కాదు. మన ఆలోచనలోను ప్రవర్తనలోను దిద్దుబాటు అవసరమని కేవలం హితవు పలికితేనే మనం సమర్థించుకొనడానికి ప్రయత్నిస్తాం. ఇది యూదా ప్రజలకు సమస్యగా ఉండింది. వారు తమ పాపభూయిష్టతను గుర్తించడంగాని, వారి దోషాన్ని ఒప్పుకొనడం గాని అంగీకరించినవారు కారు. తమ మార్గాలను వారు పరీక్షించుకొనడానికి బదులు, వారు దేవుని మార్గాలను పరీక్షించి, అవి అన్యాయమైనవిగా వారు తీర్పు తీర్చారు. దేవుని వర్తమానికుడైన యిర్మీయాను వారు పరీక్షించి, అతడు వారి శత్రువుల పక్షంవాడని వారు తీర్పు తీర్చారు. తమ సొంత హృదయాలను, జీవితాలను పరిశోధించి తెలిసికొనడం వారివలన కాకపోయింది.

దేవుని వాక్యపు వెలుగులో మనలను మనమే దీర్ఘంగా చూచుకోవలసి ఉంది. ఆయన వాక్యము అద్దమువలె ఉండి మన నిజ స్వరూపాన్ని ప్రతిబింబింపజేస్తుంది (యాకోబు 1:21-25). దేవుడు ఎలా మనలను చూస్తాడో, అలాగున మనం ఆయన వాక్యం గుండా మనలను చూచుకోవచ్చు. మనకందరికి మూడు రకాలైన స్వరూపాలు ఉంటాయి: అందులో ఒకటి మనలను గూర్చి మనం చిత్రించుకొనేది; రెండవది, యితరులు మనలను గూర్చి చిత్రించుకొనేది; మూడవది, మనలను గూర్చి దేవుడు కలిగియున్నది, మనలను మనం చూచుకున్న విధంగా దేవుడు మనలను చూడకపోవచ్చు, మనలను మనం చూచుకొన్నట్టు, యితరులు మనలను చూడకపోవచ్చు. మన నిజమైన స్వరూపము దేవుడు మనలను చూచేదే. దేవుని కండ్లద్వారా మనలను మనం చూచుకొనడానికి, దేవుని వాక్యం తీక్షణంగా పఠించాలి.

"పరిశీలించి తెలిసికొను" అనే ప్రయోగం, "దేవుని వాక్యమను ఆత్మ ఖడ్గాన్ని" (ఎఫెసీ. 6:17) ఉపయోగించుతూ మనలను మనము పరీక్షించుకోవాలని సూచిస్తుంది. ఇతరులతో మనలను మనం పోల్చి చూచుకున్నప్పుడు, మనం తప్పుడు, అపరిపూర్ణమైన మాదిరులను ఉపయోగించువారమై యుంటాం గనుక మనకు తప్పుడు రీడింగ్స్ (కొలతలు) వస్తూ ఉంటాయి. దేవుని పరిపూర్ణమైన మాదిరియగు యేసు (ప్రభువు)తో దేవుని వాక్యము మనలను పోల్చుతుంది: "క్రీస్తుయేసునకు కలిగిన ఈ మనస్సు మీరును కలిగియుండుడి" (ఫిలిప్పీ. 2:5). క్రీస్తుపై మన దృష్టిని నిలిపి, మన జీవితాలు ఆయనవలె ఉండ మనం ప్రయత్నించినట్టయితే, "మన మందరము ... ప్రభువుయొక్క మహిమను అద్దమువలె ప్రతిఫలింపజేయుచు, మహిమనుండి అధిక మహిమను పొందుచు, ప్రభువగు ఆత్మచేత ఆ పోలికగానే" మార్చబడుదుము (2 కొరింథీ. 3:18).

మారుమనస్సులో రెండవ మెట్టు "మనము యెహోవా తట్టు తిరుగుదము" (40బి).

తనవైపుకు తిరుగుడని చెప్పడానికి దేవుడు వారి మధ్యకు యెషయా, యిర్మీయాలాంటి ప్రవక్తలను పంపి అనేక సంవత్సరాలు సంగతులు వినిపించాడు. తప్పు దిశగా వారు పయనించడంవలన కలుగబోయే ఫలితాలను గూర్చి ఇశ్రాయేలీయులను ఆయన హెచ్చరించాడు. వారు యెహోవాను విసర్జించిన సంగతిని అంగీకరించలేదు. సరిగదా, ఆ ప్రవక్తలను తారుమారు చేసే మత పిచ్చుగాళ్లలా వారు భావించారు! తప్పుగా నడిపింపబడినవారి మార్గాల ప్రతిఫలాలను అనుభవించిన తరువాతనే, తమ్మును తాము పరీక్షించుకొనడం గాని, దేవుని వైపు తిరుగాలనే గ్రహింపు కలగడం గాని జరిగింది. దేవుని వైపుకు మరలడం మారుమనస్సు కార్యమైయుంది.

ఆత్మసంబంధమైన అభివృద్ధి అని అనడంలో కొన్నిసార్లు అర్థమేమంటే – మనం జీవితంలో ఎక్కడ తొలిగిపోయామో అక్కడికి తిరిగి వెళ్లి అక్కడనుండి అసలైన రోడ్డును వెంబడించాలి. నీతి మార్గపు ప్రక్కనే అపవాది ఎల్లప్పుడు నిలిచి, ఎక్కువ ఉల్లాసమునకు, లేక ఎక్కువ సాధించడం అనేవాటితో ఆకర్షింపజేస్తూ ఉంటాడు. ముందుగా మనం తలంచుకునే అవసరతలకు తన విధానంలో వాగ్దానాలు చేస్తూ మనలను దారి మళ్లింప బూనుకుంటాడు. మంచి నమ్మకంతోనే మనం తప్పు త్రోవలు తరచుగా తీసికొంటాం, అదే దేవుడు మనం వెళ్లాలని కోరుకున్న మార్గమనుకుంటాం. మనం యికను తిరిగి రాలేనంత దూరం తీసికొని వెళ్లాలని సాతాను నిరీక్షిస్తాడు. మనం తప్పు చేశామని తరువాత గ్రహించినా జరిగిందే జరుగుతుంది. ఒకే ఒక పరిష్కార మార్గమేమంటే, దేవుడైన యెహోవా వైపుకు తిరగడం. దాని వెల ఎంతైనా, తప్పిపోయిన మార్గంలో అయ్యేంత ఎక్కువ ఖరీదేమి కాదు.

మూడవది, మారుమనస్సుకు "మన హృదయములను మన చేతులను ఎత్తికొందము" (41 వ.). "మనచేతులను కాదు, మన హృదయములనే ఎత్తి కొందము" అని చదువడాన్ని R. K. Harrison సూచిస్తున్నాడు. ఇలా తర్జుమా చేయడం మేలని అతడు భావిస్తున్నాడు.[1] దేవుని ప్రజలు ఆరాధనను కర్మకాండ జరిగిస్తున్నట్టు అతని ప్రతిపాదనలో గుప్తమైయుంది – ఒకవేళ యితర దేవతలకు చేసినట్టే యెహోవాకు కూడ జరిగిస్తున్నట్టుంది – వాటిలో వారి హృదయం ఉండదు. చేతులెత్తుటలో వారు అనుభవం గలవారే, నోటితో సరియైన మాటలు పలుకుతూ, సరియైన చర్యలు జరిగిస్తునే పోతున్నారు. అయితే దేవునివైపు తమ హృదయాలను ఎత్తుటలో వారు చేతగాని వారైనట్టున్నారు. దేవుని సొంత ప్రజలు తమ హృదయములను చేతులను యితర దేవతల తట్టు తిప్పుతున్నారు. నిజ దేవునివైపునకు తమ చేతులను హృదయములను ఎత్తే సమయం ఆసన్నమయ్యింది.

ఎవరి విగ్రహ దేవతలను వారు పూజించిరో, ఆ దేశములవారి చేతికే దేవుడు యూదాను అప్పగించాడు, అయితే ఆ దేవతలు వారికి సహాయం చేయలేకపోయాయి. కడకు వారికి ఆ సంగతి అర్థమయ్యింది. దేవునివైపు తమ హృదయాలను చేతులను ఎత్తారనుటలో వారి స్వభావము, కార్యములు రెండును మార్చుకొన్నట్టు సూచిస్తుంది. హృదయములతో మనం విశ్వసిస్తాము (రోమా 10:10), మన చేతులతో ఆయన పని జరిగిస్తాం.

## ప్రార్థించు

వారికి ఒక ఉదాహరణనిస్తూ, ప్రార్థించుటకు ప్రభువైన యేసు తన శిష్యులకు నేర్పించినట్టు (మత్తయి 6:9–13), ప్రార్థించుడని జనులనుకోరుతూ, అది ఎలా చేయాలో యిర్మీయా వారికి మాదిరిని చూపాడు:

> మేము తిరుగుబాటు చేసినవారము, ద్రోహులము నీవు మమ్మును క్షమింపలేదు. కోపము ధరించుకొనినవాడవై నీవు మమ్మును తరముచున్నావు. ... మా ప్రార్థన నీయొద్ద చేరకుండ నీవు మేఘముచేత నిన్ను కప్పుకొనియున్నావు. జనముల మధ్య మమ్మును మష్టుగాను చెత్తగాను పెట్టియున్నావు. మా శత్రువులందరు మమ్మును చూచి యెగతాళి చేసెదరు. భయమును గుంటయు పాడును నాశనమును మాకు తటస్థించినవి (3:42–47).

ఇక్కడ యివ్వబడిన నమూనాను నీవు ఎలా వెంబడించగలవు? మొదటిగా, నీ అపరాధములను తిరుగుబాటును అంగీకరించు (42ఎ వ.). దేవుని యెదుట నీ నీచ స్థితిని అంగీకరించడంతో ఆత్మ సంబంధమైన సరిక్రొత్తదనం ఆరంభమౌతుంది. యూదా చుట్టు పట్లనున్న దేశ జనులతో వారు కల్తీ వివాహాలు చేసికొని అపవిత్రులైన సంగతిని ఎజ్రా గ్రహించినప్పుడు, అతడు తన మోకాళ్లమీద ఒరిగి తన చేతులు చాపి, దేవుడు తన ప్రజలైన వారిపట్ల ఎంత దయగా ఉన్నాడో గుర్తించి, ఆయన ఎదుట వారి పాపములను ఒప్పుకున్నాడు (ఎజ్రా 9:5–15). తరువాత, నెహెమ్యా కూడ అలాటి ప్రార్థనయే చేశాడు, దేవుని యొక్క భయభక్తిని రేకెత్తించే గొప్పతనాన్ని గుర్తించి, ఆయన ఎదుట తన జనులు చెడిపోయిన స్థితిని ఒప్పుకున్నాడు (నెహెమ్యా 1:5–11). దేవుడు సర్వమైయున్నాడనియు, దేవుడు లేని నరుడు వట్టివాడనియు శక్తివంతమైన ప్రార్థనలు గుర్తించాయి.

రెండవది, దేవునిని నీకు దూరంచేసింది నీ దుష్కార్యములేయన్న వాస్తవాన్ని అంగీకరించుతూ దేవుడు నీ పాపాన్ని క్షమించలేదని గుర్తించు (42బి వ.). ఎవడును తప్పించు కోలేనంతమట్టుకు దేవుని కోపము దోషులను తరముతుంది లేక వెంటాడుతుంది (43 వ.). నిన్ను, నీ దేవుని వేరు చేయునంతగా పరలోకానికి నీకు ఉన్న సంబంధాలు దట్టమైన పాపపు మేఘాలచేత కప్పబడ్డాయా (44 వ.)? నీవు చెత్తవైయున్నట్టు నీ పొరుగువారును, నీ స్నేహితులును నిన్ను గూర్చి మాట్లాడుకొంటున్నారా (45, 46)? ఆపద నిన్ను చుట్టుకొని, భయము, నాశనము నీకు తటస్థించినప్పుడు – అదంతా నీ పాపాన్ని బట్టియే (47 వ.) – గతంలో నీవెన్నడు ప్రార్థించనంతగా ప్రార్థించడమే పరిష్కారం.

## ఏడ్పు (విలపించు)

యిర్మీయా ప్రార్థించుతూ, ఏడ్చాడు. అతడు యిలా అన్నాడు,

> నా జనులకు కలిగిన నాశనమును నేను చూడగా నా కన్నీరు ఏరులై పారుచున్నది. యెహోవా దృష్టియుంచి ఆకాశమునుండి చూచువరకు నా కన్నీరు ఎడతెగక కారుచుండును. నా పట్టణపు కుమార్తెలనందరిని చూచుచు నేను దుఃఖాక్రాంతుడనైతిని. ఒకడు పక్షిని తరుమునట్లు శత్రువులు నిర్నిమిత్తముగా నన్ను వెనువెంట తరుముదురు. వారు చెరసాలలో నా ప్రాణము తీసివేసిరి నాపైన రాయి యుంచిరి నీళ్లు నా తల మీదుగా పారెను “నాశనమైతినని” నేననుకొంటిని (3:48–54).

కన్నీళ్లతో ప్రార్థించు (48-50 వచనాలు)! నీకు కావలసినదాన్ని పొందడానికి ఉద్దేశింపబడిన కృత్రిమపు కన్నీళ్లు కార్చకు. చావుదగ్గర ఏడ్వడానికి బాడుగకు తెచ్చుకునే ఏడ్పుల వారియందు దేవునికి యిష్టముండదు. పాపముకొరకైన వేదనతో హృదయం పగిలి వచ్చే నిష్కపటమైన కన్నీటిని దేవుడు లక్ష్యపెడతాడు. విలపించు ప్రవక్తయైన యిర్మీయా యూదాకు మాదిరిగా ఫలించాడు. దేవుని ప్రజలు నశించినందుకు అతని కన్నీళ్లు పొంగి ప్రవహించాయి. యెరూషలేము సర్వనాశనమైనదానికి తాను ఎలా ఫీలయ్యాడో కనుపరచడానికి చాలినన్ని కన్నీళ్లు యిర్మీయాకు లేకపోయాయి. అది కేవలం నాశనమైనందుకే అతడు కన్నీళ్లు విడువలేదు, ఆ నాశనానికి హేయమైన నైతిక చెడుతనం ఆ ఏడ్పుకు హేతువయ్యింది.

నీకు కన్నీళ్లు తెచ్చేదేమి? జీవితం తల్లక్రిందులయ్యింది, కదా? అల్పమైన సంగతుల విషయమై చింతించడం, మనకు వేదన కలిగించవలసిన సమస్యలలో నవ్వడం జరుగుతుంది. మన పాపములు, లోకపాపములు మనలను ఏడ్చేవిగా చేయాలి. పరలోకమునుండి దేవుడు చూచేవరకు, విరిగినలిగిన మన హృదయాలు ఆయనకు కన్పించేవరకు, గాయపడిన మన ఆత్మలకు స్వస్థత ఆరంభమయ్యేవరకు మన కన్నీళ్లు ఆగక కారుతూ ఉండాలి.

“నీతి జనములు ఘనతకెక్కుటకు కారణము పాపము ప్రజలకు అవమానము తెచ్చును” (సామె. 14:34) తమ సొంత దేవతలను కోరుకోవచ్చు, తమ యిష్టం వచ్చినట్టు జీవించవచ్చునని అతిశయించునంతగా ఒక దేశ ప్రజలు మదించినప్పుడు, ఆ దేశము దేవుని చేతిలో తంటాలు పెట్టబడుతుంది. స్వతంత్రము అంటే నాకు యిష్టం వచ్చినట్లు ప్రవర్తించడమని ఎన్నడూ అర్థం కాదు. నిజమైన స్వాతంత్ర్యమంటే, మంచి చేయకోరు కొనడమే. ఏది రైటో అనేదానికి సంబంధించి నిరంకుశమైన నిర్ణయాలు స్వాతంత్ర్యాన్ని తీసివేస్తాయి ఎందుకంటె, మానవ తీర్పులు స్వార్థపరమైనవై, మనకు అనుకూలంగాను పరపక్ష ద్వేషంతోను కూడినవైయుంటాయి. నీతి అనేది దేవుని మార్గాలను వెదకి వాటిలో నడుచుకొనడానికి సంబంధించిందై ఉంటుంది. దేవునితో నడవడమనే మానవ ప్రయాసలు లోపభూయిష్టమైనవిగా ఉంటాయి. ఆయన ముఖ దర్శనం చేసికోవాలనే ఉద్దేశంతో ఏ దేశం ప్రయాసపడుతుందో ఆ దేశం హెచ్చింపబడుతుంది.

దైవచిత్తానుసారమైన దుఃఖము శుద్ధీకరణకు, ఆత్మకు కలిగిన గాయాన్ని మాన్పుటను తెస్తుంది (51 వ.). కండ్లతో చూచునదే దుఃఖాన్ని కల్గించినట్టయితే, తప్పును తెలిసికొనుట వలన కలిగే పశ్చాత్తాపానికి వచ్చే కన్నీళ్లు ఆత్మపై తన ప్రభావాన్ని కనుపరస్తూ శుద్ధీకరిస్తుంది. ఆత్మయొక్క వేదనను కండ్లు ప్రతిఫలింపజేస్తాయి, బయలుపరుస్తాయి. కన్నులు కాఠిన్యాన్ని మారుమనస్సు పొందనొల్లని స్థితిని చూపుతాయి. లేదా హృదయము యొక్క సున్నిత స్థితిని పశ్చాత్తాపమువలన కలిగిన దుఃఖాన్ని మారుమనస్సు చూపుతాయి. పాపముయొక్క దోషము, భారమువలన పగిలిన సున్నిత (లేత) హృదయాన్ని దేవుడు బాగుచేయగలడు.

పశ్చాత్తాపమువలన కలిగిన దుఃఖము మనలను మన గ్రహింపుకు తెస్తుంది. పాపము నిజాన్ని దాచగలదైయుంది. నిజ లోకంనుండి అది మనలను తీసికొనిపోయి, మధ్య

లోకాన్ని మనకొరకు సృష్టించగలదు. పాపముచేత కప్పబడిన ఆత్మను యిర్మీయా ఈ వచనాలలో బయలుపరుస్తున్నాడు.

తన్ను ద్వేషించడానికి హేతువేదియు లేకపోయినను, (బోయవాడు) పక్షిని వెంటాడినట్లు తన శత్రువులు అతని వెంటాడుతున్నట్టు 52వ వచనంలో అతడు విలపించాడు. వాస్తవంగా అతడు తన సొంత పరిస్థితిని గూర్చి యిలా పలికినట్టున్నాడు. యూదాకును యెరూషలేమునకును ఏమి సంభవించిందో దానికి యిర్మీయా కారకుడు కాడు. వారికి అతడు సత్యాన్ని ప్రకటించాడు. వారి బ్రదుకులను రక్షించడానికి అతడు ప్రయత్నించాడు. ఆ సందేశాన్ని వారు అనుసరించి నడుచుకొనేదానికి బదులు ఆ వర్తమానికునే వారు లేకుండా చేయాలనుకున్నారు. తన్ను వారు ఎలా ట్రీట్ చేశారో అతడు వారికి గుర్తుచేసి, దాన్ని అతడు ఎలా – దేవునికి ప్రార్థించుటవలన సర్దుబాటు చేసికొన్నాడో తెలిపాడు. దేశ జనులు తమ నిజ స్థితిని గ్రహించి, వారి తప్పును గుర్తించి, దేవునియొద్దకు మరలినట్టయితే, పశ్చాత్తాపమువలన కలిగిన వారి దుఃఖములో ఆశ్రయ స్థానాన్ని వారు కనుగొనగలరు. ఆ దేశము యిర్మీయాను అన్యాయంగా బాధించింది, అయితే దేవుడు యూదాను న్యాయాన్ని బట్టి నాశనం చేశాడు.

53, 54 వచనాల్లో ఉపయోగించిన సాదృశ్యాలు తన్ను గోతిలో పడవేసిన అనుభవంలోనుండి తెచ్చినవి కావచ్చు (యిర్మీయా 38:6–13), కాని ఆ దేశమంతా అనుభవించిన గాఢమైన దుఃఖాన్ని ఈ భాగం అలంకార రూపంలో వర్ణించియుండవచ్చు. గోతిలో త్రోయబడి లేదా (సమాధిలోవలె) రాతిచేత కప్పబడి అనే భావన యూదా యొక్క మృతతుల్యమైన స్థితిని బాగుగా చిత్రించినట్టుంది. “నాపైన రాయి ఉంచిరి, నీళ్లును నా తలమీదుగా పారెను” అనేవి ప్రాణముతీయుట, మునిగిపోవుట అనే భావాలతో కూడినవై సమాధులతో కూడిన స్మశాన స్థితిని సూచించుచున్నట్టుంది. యిర్మీయా పలుకులు పాప ఫలితాలను సూటిగా వర్ణిస్తున్నాయి. పాపమునకు వచ్చు జీతము “మరణమని” లేఖనాల్లో మరోచోట చెప్పబడింది (రోమా 6:23); అది దేవునినుండి “వేరు చేయబడడం” (యెషయా 59:2). తమ ప్రవర్తనకు నిజమైన పశ్చాత్తాపముతో కూడిన దుఃఖాన్ని ప్రదర్శించుడని, ఆ నాశనంలో చావగా మిగిలినవారితో ప్రవక్త అర్థిస్తున్నాడు. వారి నిజమైన పరిస్థితి ఏమైయుందో, దేవునితో వారు ఏలాటి సంబంధం గలవారైయున్నారో గ్రహించునట్టుగా అతడు వారికి సహాయం చేశాడు.

లూకా 15:11–24లో, కుటుంబంలో తనకు రావలసిన సొత్తును తీసికొని దూరదేశం ప్రయాణమై పోయి. ఆ డబ్బు పూర్తిగా ఖర్చయ్యేవరకు పాప భోగములయందు సుఖించిన ఒక కుమారుని కథను ప్రభువైన యేసు తెలిపారు. పాపపు బురదలలో పోర్లాడుతూ, పందులు కాచే పనికి తన్ను నియమించుకొన్నవాడు తనకు జీతమేమియు యివ్వని స్థితిలో అతడు తన బుద్ధికి తిరిగివచ్చాడు. అప్పుడు మాత్రమే తానేమి చేసింది గ్రహించగలిగాడు, అప్పుడు మాత్రమే అతడు తన యింటికి తిరిగి రాగోరాడు. తన పాపాన్ని ఒప్పుకొనడానికి మాత్రమే కాదు, తన తండ్రికి కుమారుడననిపించుకునే యోగ్యత కూడ తనకు లేదని చెప్పుకొనడానికి సిద్ధపడినవాడై యింటి ముఖం పట్టాడు; తన తండ్రి కూలివాండ్లలో ఒకడుగా ఉంటానికే యిష్టపడి తిరిగి వచ్చాడు. అతడు

వచ్చుచుండగా, అతని తండ్రి చూచి, అతనిని కలిసికొనుటకు పరుగెత్తి, కౌగలించుకుని, అతడు శుద్ధీకరింపబడిన మీదట శుభ్రమైన బట్టలు అతనికి ధరింపజేసి, అతని చేతికి ఉంగరం పెట్టాడు. తప్పిపోయిన తన కుమారుడు తిరిగి వచ్చాడనే తన సంతోషాన్ని ప్రతివానికి ప్రకటించాడు. ఆ సందర్భంగా గొప్ప విందు చేయించాడు. అక్కడ తండ్రి దేవుని సూచిస్తున్నాడు. వారు తన యింటికి తిరిగి వచ్చినప్పుడు ప్రేమతో స్వీకరించి క్షమించి, తన కుమారులను కుమార్తెలను చేర్చుకొన యిచ్ఛగలవాడుగా ఆయన చిత్రింపబడ్డాడు.

## దేవుని కనికరం మీద నిన్ను నీవు పడవేసికో

తరువాత, యిర్మీయా దేవుని కనికరమునకు విన్నవించుకున్నాడు:

> యెహోవా, అగాధమైన బందీగృహములోనుండి నేను నీ నామమునుబట్టి మొరలిడగా నీవు నా శబ్దము ఆలకించితివి సహాయముకొరకు నేను మొఱ్ఱపెట్టగా చెవిని మూసికొనకుము. నేను నీకు మొరలిడిన దినమున నీవు నాయొద్దకు వచ్చితివి – భయపడకుమి అని నీవు చెప్పితివి. ప్రభువా, నీవు నా ప్రాణవిషయమైన వ్యాజ్యెములను వాదించితివి నా జీవమును విమోచించితివి. యెహోవా, నాకు కలిగిన అన్యాయమును నీవు చూచియున్నావు నా వ్యాజ్యెము తీర్చుము. పగతీర్చుకొనవలెనని వారు నామీద చేయు ఆలోచనలన్నియు నీవెరుగుదువు. యెహోవా, వారి దూషణయు వారు నామీద చేయు ఆలోచనలన్నిటిని నా మీదికి లేచినవారు పలుకు మాటలును దినమెల్ల వారు నామీద చేయు ఆలోచనయు నీవు వినియున్నావు. వారు కూర్చుండుటను వారు లేచుటను నీవు కనిపెట్టుము నేను వారి మాటలకు ఆస్పదమైతిని. యెహోవా, వారి చేతిక్రియనుబట్టి నీవు వారికి ప్రతీకారము చేయుదువు, వారికి హృదయకాఠిన్యము నిత్తువు. వారిని శపించుదువు. నీవు కోపావేశుడవై వారిని తరిమి యెహోవా యొక్క ఆకాశముక్రింద నుండకుండ వారిని నశింపజేయుదువు (3:55–66).

నీవు ఎంతటి దీనస్థితిలో ఉన్నను, దేవుడు నీ ప్రార్థన వినగలడు (55, 56 వచనాలు) అది మంచి వార్త. మంచి వార్తను మనం అంగీకరించక ముందు, కొన్నిసార్లు మనం చెడ్డ వార్త వినవలసిన అవసరముంటుంది. చెడ్డ వార్త ఏమంటే, పాపము మనలను నిరాశతో కూడిన అధోగతికి, మురుగు నీటిగోతి యొక్క అడుగు భాగాలకు మనలను కొనిపోవచ్చు. అలాటి గోతిలోనుండి మారుమనస్సు పొందినవాని కేక వస్తుంది, దేవుడు ఆ కేకను వింటాడు. సముద్ర గర్భములోనున్న చేప కడుపులోనుండి మొరలిడిన యోనా విన్నపాన్ని దేవుడు ఆలకించాడు (యోనా 2:2). యాత్ర కీర్తనలలో ఒకదానియందు, ఇశ్రాయేలు దేవునికి ప్రార్థించాడు: "యెహోవా, అగాధస్థలములలోనుండి నేను నీకు మొఱ్ఱపెట్టుచున్నాను" (కీర్తన. 130:1). దేవుడు తన పిల్లల మొరలను ఆలకిస్తాడు! సహాయము కొరకు వారు మొరలిడినప్పుడు, ఆయన వారి ప్రార్థనలనుండి తన చెవిని త్రిప్పుకోడు. అది మంచి వార్త!

దేవుడు సమీపానికి వచ్చి నీ భయములను తొలగిస్తాడు (57 వ.). లోతైన గోతిలో వేయబడి, దానిపై బరువైన రాయితో కప్పబడేదానికంటె భీతిని గొల్పేది మరేముంటుంది? ఒక పరిస్థితి బహు చెడ్డదైయుంది: నైతిక ఆత్మ సంబంధమైన చెడుతనమనే గోతియొక్క

అడుగు భాగంలో కూరుకొనిపోయి, మనం స్వయంగా సమకూర్చుకున్న పాపపు భారమును తలపై పెట్టుకొనడం. దేవుడు విని ఆలకింపలేనంతగా పోవు గొయ్యి అంత లోతైనది కాదు, తలపైనున్న భారం అంత పెద్దదీ కాదు. పాపము ఎక్కడ అధికమైయుందో దేవుని కృప అంతగా విస్తరించిందని, దేవుని శక్తియు, ఆయన ప్రేమయు ప్రదర్శింపబడింది (రోమా 5:20). సముద్రపు తుఫానులచేత కొట్టబడుతున్న మన జీవితాలలోనికి ప్రభువైన యేసు నడుచుకొంటూ వచ్చి, "పలుకరించి – ధైర్యము తెచ్చుకొనుడి; నేనే, భయపడకుడని" చెప్పును (మార్కు 6:50బి).

నీవు దోషివని యెరిగి, క్రీస్తు నీ ఉత్తరవాదిగా విమోచకుడుగా నిలుస్తాడు (58 వ.). న్యాయస్థానపు దృశ్యాన్ని ఒకసారి ఊహించు: నీవు దోషివి, అది నీకు తెలుసు, నీ ఉత్తరవాదికి కూడ అది తెలుసు. నీవు చేయగలిగిందంతా దోషివన్న విషయాన్ని ప్రవేశపెట్టి – కోర్టువారి దయకు నిన్ను నీవు అప్పగించుకో – నీ న్యాయవాది నీపైన ఉన్న జరిమానాను కట్టకుంటే, నీ పైనున్న నేరాలన్నిటిని ఆయన తీర్చకుంటే. ఒకే ఒక ఉత్తరవాది ఆ పని జరిగించాడు:

> నా చిన్నపిల్లలారా, మీరు పాపము చేయుకుండుటకై యీ సంగతులను మీకు వ్రాయుచున్నాను. ఎవడైనను పాపము చేసినయెడల నీతిమంతుడైన యేసుక్రీస్తు అను ఉత్తరవాది తండ్రియొద్ద మనకున్నాడు. ఆయనే మన పాపములకు శాంతికరమై యున్నాడు; మన పాపములకు మాత్రమే కాదు, సర్వలోకమునకును శాంతికరమై యున్నాడు (1 యోహాను 2:1, 2).

పాపమునకు వచ్చు నీ జీతాన్ని ఆయన చెల్లించి, ఆయన నిన్ను తనకొరకు విమోచించుకొనినందున, ఆయన నీకు ఉత్తరవాదిగా, డిఫెన్స్ లాయరుగా ఉన్నాడు. గనుక "నీవు నీ సొత్తుకాదు విలువపెట్టి కొనబడిన"వాడవు (1 కొరింథీ. 6:19, 20).

నీ శత్రువుల యెదుట ఆయన నిన్ను న్యాయముగనున్నట్టు కనుపరచుతారు (59–66 వచనాలు). బబులోనుచే యూదా చెరగొని పోబడడానికి దేవుడు ఎందుకు అనుమతించాడో యిర్మీయాకు తెలుసు. ఒక దినాన దేవుడు తన ప్రజలను స్థిరపరచునని కూడ అతడెరుగును. ఈ పని జరగడానికి ఎంతకాలం పట్టుతుందో కూడ అతనికి ముందే తెలుసు. యిర్మీయా 25:11, 12లో అతడిలా రాశాడు:

> ఈ దేశమంతయు పాడుగాను నిర్జనముగాను ఉండును; ఈ జనులు డెబ్బది సంవత్సరములు బబులోను రాజునకు దాసులుగా ఉందురు. యెహోవా వాక్కు ఇదే – డెబ్బది సంవత్సరములు గడచిన తరువాత వారి దోషములనుబట్టి నేను బబులోను రాజును, ఆ జనులను కల్దీయుల దేశమును శిక్షింతును; ఆ దేశము ఎప్పుడు పాడుగనుండునట్లు నియమింతును.

సరిగ్గా, డెబ్బై సంవత్సరాల తరువాత, పారసీకపు సామ్రాజ్యంచేత బబులోను కూల్చివేయబడింది. పారసీక దేశపు రాజైన కోరెషు యూదులు తమ స్వదేశానికి వెళ్లునట్టు ఆజ్ఞ జారీ చేశాడు. వారు తమ తమ దేశాన్ని తిరిగి కట్టుకొని, తమ దేవుని ఆరాధనను పునరుద్ధరించుకొనడానికి పరిస్థితులు కల్పించబడ్డాయి. ఇది నెరవేర్చబడినట్టు ఎజ్రా

1:1 అంటుంది; "పారసీక దేశపు రాజైన కోరెషు ఏలుబడిలో మొదటి సంవత్సరమందు యిర్మీయా ద్వారా పలుకబడిన తన వాక్యము" నెరవేరింది.

ఈ భవిష్యద్ జ్ఞానముతో, తమ శత్రువులచే యూదా అణచబడిన సంగతిని యిర్మీయా వర్ణించాడు. వారి పన్నాగములను ఆయన చూచాడు, వారి దాడుల గుసగుసలను, గేలిచేయువారి పాటలను ఆయన విన్నాడు. తమ శత్రువులు వీధులలో పాటలకు వారి హేళనలకును యిర్మీయాయు యూదా వారును గురియైయ్యారు. తన న్యాయమైన స్వభావాన్నిబట్టి వారి చర్య ప్రకారము దేవుడు వారికి ప్రతిఫలమిస్తాడని యిర్మీయాకు తెలుసు. దేవుడు ఏమి చేస్తాడని అతనికి ముందుగానే తెలుసో దాన్ని జరిగించుమని చివరి రెండు వచనాలలో అతడు దేవుని వేడుకున్నాడు. తగిన కాలములో దేవుడు బబులోనీయుల సంగతి తేల్చుకుంటాడన్న విషయాన్ని యూదా జనులు తెలిసికోవాలని అతడు కోరుకుంటాడు.

మనకు కీడుచేసిన వారి విషయం కూడ మనం ప్రతీకారానికి తలపెట్టనవసరం లేదనే సంగతి మనకు అభయంగా యివ్వబడింది. మానవ వాంఛ కీడుకు ప్రతికీడు చేయడం - ఇతరులు మనకు ఏమి చేశారో అదే మనం వారికి చేయాలని కోరడం, లేదా అంతకంటె ఎక్కువ కీడు చేయగోరడం దానివలన సంఘ రక్షణ ఉద్రిక్తమౌతుంది. మనకు చేయబడిన కీడును దేవుని చేతికి మనం అప్పగించినట్టయితే, మనం చేయగలిగే దానికంటె దేవుడు దాని విషయంలో బహు జాగ్రత్తగా క్రియ చేస్తాడు. ఎప్పుడు కావాలని మనం కోరతామో అప్పుడే ఆయన ఆ పని చేయకపోవచ్చు, కాని ఆయన దాన్ని న్యాయముగాను నీతిగాను జరిగిస్తాడు. ద్వితీయో. 32:35నుండి కోట్ చేస్తూ, అందుకే పౌలు రోమీయులకు బోధించాడు: "ప్రియులారా, మీకు మీరే పగతీర్చుకొనక, దేవుని ఉగ్రతకు చోటియ్యుడి - పగతీర్చుట నా పని, నేనే ప్రతిఫలమునిత్తును అని **ప్రభువు** చెప్పుచున్నాడని వ్రాయబడియున్నది" (రోమా 12:19).

## సందేశమేమి?

మనము దేవుని దృష్టిని పొందే మార్గముంది: ఆయన మాటను మనం ఆలకించి నప్పుడు, ఆయన మన మనవిని వింటాడు. ఆలయ ప్రతిష్ఠ అనంతరం దేవుడు సొలొమోనుకు ప్రత్యక్షమైన తరువాత, అతని మనవిని ఆయన ఆలకించినట్టు ఆయన అతనికి అభయమిచ్చాడు. సొలొమోనుకు దేవుడిచ్చిన ఆదేశాల్లో (ఆజ్ఞలలో) ప్రతిసారి ఆయన శ్రద్ధను పొందే మార్గమొకటి ఉంది. "నా పేరు పెట్టబడిన నా జనులు తమ్ము తాము తగ్గించుకొని ప్రార్థనచేసి నన్ను వెదకి తమ చెడుమార్గములను విడిచినయెడల, ఆకాశమునుండి నేను వారి ప్రార్థనను విని, వారి పాపమును క్షమించి, వారి దేశమును స్వస్థపరచుదును" (2 దినవృ. 7:14).

సూచన

[1]R. K. Harrison, *Jeremiah and Lamentations,* The Tyndale Old Testament Commentaries, gen. ed. D. J. Wiseman (Downers Grove, Ill.: Inter-Varsity Press, 1975), 228.